క్లుప్తంగా

ట్యాంకులను శుభ్రం చేయాలి



ఫిల్టర్‌బెడ్స్ పరిశీలిస్తున్న కమిషనర్, ఇంజినీర్లు

గుంతకల్లుటౌన్: ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను తరచూ శుభ్రం చేస్తూ ప్రజలకు శుద్ధమైన నీరందించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ వాటర్ వర్క్స్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఎస్.ఎస్.ట్యాంకు, ఫిల్టర్ బెడ్స్, పంపింగ్ మోటార్ల పనితీరును ఇంజినీర్లతో కలసి ఆయన పరిశీలించారు. మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, డీఈ షబానా, ఏఈలు సుదర్శన్, ప్రతాప్, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. అంతకుముందు కమిషనర్ మస్తానయ్య దర్గా ఉరుసు ఉత్సవాల సందర్భంగా పారిశుద్ధ్య పనులను పరిశీలించి, ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని దుకాణదారులకు సూచించారు.

ఫలితాల విడుదల

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ కోర్సుల రెండో సెమిస్టర్ ఫలితాలను ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వెంకటరమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరామ్‌నాయక్ విడుదల చేశారు. సోమవారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ 279 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 169 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మార్క్‌మెమోలు కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, రీవాల్యూయేషన్ లేదా రీకౌంటింగ్‌కు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో సహకరించిన కాలేజీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ ఆర్.నాగరాజు, కమిటీ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకత



మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

గుంతకల్లు రూరల్: అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీ తనం తీసుకురావడానికే సమాచరహక్కు రూపొందించబడిందని వ్యవసాయ శాఖ ఏడీ సత్యనారాయణ అన్నారు. సోమవారం గుంతకల్లులో పర్యటించిన ఆయన స్థానిక మార్కెట్ యార్డులో రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ద్వారా అవసరమైన సమాచారాన్ని అధికారుల నుంచి ప్రజలు పొందవచ్చన్నారు. అనంతరం వ్యవసాయ శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏఓ లీనా వసుంధర, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల అరెస్ట్ తగదు

శింగనమల: హోంమంత్రి అనిత జిల్లా పర్యటన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుల్ని ముందస్తుగా అరెస్ట్ చేయడం తగదని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరికూటి కాటమయ్య సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. జిల్లాలో ఎస్సీలపై దాడులు, దౌర్జన్యాలు , అక్రమ కేసులు గురించి తమ గోడు చెప్పుకుందామనుకుంటే , హోం మంత్రిని కలవనీయకుండా కూటమి ప్రభుత్వం హౌస్ అరెస్ట్ చేయించిందన్నారు. ఏడుగురాళ్లపల్లిలో దళిత బాలికపై 14 మంది అత్యాచారం చేస్తే, పరామర్శించడానికి మంత్రికి ఇప్పుడు తీరికదొరికినట్లుందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు దళిత ఎమ్మెల్యేలున్నా దళిత బాలిక ఘటనపై మాట్లాడిన పాపాన పోలేదన్నారు. ఆ బాలికకు న్యాయం జరగకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సెల్ విభాగం తరపున భారత అంబేడ్కర్ విగ్రహం దగ్గర అమరణ నిరాహార దీక్ష చేపడుతామన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం



కేంద్ర ప్రభుత్వ పథకాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖ ద్వారా జరిగిన అబివృద్ధి గురించి వివరించారు. తూట్రాళ్లపల్లి సర్పంచు సంజీవరాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ అధికారులు గ్రామాల్లో పనులు ఎక్కడ జరుగు తున్నాయో సర్పంచులకు చెప్పడంలేదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనం తరం ఎంపీపీ జి.ఉమాదేవి, ఎంపీడీఓ వీర్రాజు, ఎంఈఓ కాశెప్ప, వైఎస్ ఎంపీపీ చెన్నప్ప, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను ఆవిష్కరించారు.

అడుగుకో గుంత.. ప్రయాణం చింత

- రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలో వెళ్తున్న బస్సు



గుత్తి పట్టణంలో గుంతలమయమై అధ్వానంగా మారిన గుంతకల్లు రోడ్డు



రోడ్డుపై గుంతలో బైక్ బోల్తా పడి గాయపడిన వృద్ధుడు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద నుంచి గుంతకల్లు రోడ్డులోని బ్రిడ్జి వరకూ రోడ్డు చాలా అధ్వానంగా మారింది. రద్దీగా ఉండే రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులతో పాటు ప్రజలు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. అలాగే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం వచ్చిందంటే రోడ్డు మరింత దారుణంగా మారుతుంది. ఈ క్రమంలో సోమవారం ద్విచక్ర వాహనం రోడ్డుపై ఉన్న గుంతలో బోల్తా పడింది. ఘటనలో ద్విచక్ర వాహనం మధ్యలో కూర్చున్న వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెద్ద వాహనాలు వచ్చిన సమయంలో రోడ్డులో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ధర్నాలు, ఆందోళనలు, నిరసనలు జరిగే సమయాల్లో రోడ్డులో పూర్తిగా ట్రాఫిక్ స్తంభిస్తుంది. కనీసం పాదచారులు నడవటానికి కూడా వీలుండడం లేదు. ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అధికారులు ఎవరూ స్పందించడం లేదు. కనీసం రోడ్డుకు మరమ్మతులు కూడా చేయించలేదు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



రోడ్ల సమస్య మున్సిపాలిటీకి సంబంధం లేదు. నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులకు సంబంధించింది. సమస్యను ఎమ్మెల్యే గుమ్మనూరు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే మరమ్మతు పనులు చేయిస్తామని చెప్పారు.
– జబ్బార్‌మియా, మున్సిపల్ కమిషనర్

మోసాలకు కేరాఫ్ చంద్రబాబు



సూరేపల్లిలో క్యూఆర్ కోడ్ పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్లూరు: మోసాలకు కేరాఫ్ చంద్రబాబునాయుడు, ప్రజలను మోసపూరిత హామీలతో మభ్యపెట్టడం ఆయన పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సూరేపల్లి, గొల్లపల్లి, అరకటివేముల, ఏ.కొండాపురం గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వివరించారు. అనంతరం మొబైల్ ఫోన్లలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి మోసపూరిత హామీలను తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రమణాయాదవ్, నాయకులు కంచెం శ్రీనివాసులరెడ్డి, కేశవనాయుడు, నరసింహారెడ్డి, నాగభూషణం, రమణారెడ్డి, హరినాథ్, మోహన్, గంగరాజు యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

గుంతకల్లుటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనమివ్వాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరసయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పీహెచ్ వర్కర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. అందులో భాగంగా సోమవారం తమ విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 3 సరెండర్‌లీవ్ డబ్బులను జమ చేయాలని, రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్స్‌ను వెంటనే ఇవ్వాలని, కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు జగదీష్, నాయకులు రంగనాయకులు, ప్రేమ్, సామెల్, దాసు, కృష్ణ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మద్దతు

గుత్తి: సమస్యల పరిష్కారం కోసం తొమ్మిది రోజులుగా చేపట్టినమున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు సోమవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ కమిషన్ పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సయ్యద్ షేక్షావలి, ఇస్కాల్ గోపాల్ మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే దిగొచ్చి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వికటించిన ఇంజెక్షన్, మాత్రలు



శ్రీనివాసులు చేతులపై వచ్చిన బొబ్బలు

గార్లదిన్నె: నడుం నొప్పి నివారణ కోసం ఓ యువకుడు ప్రభుత్వాస్పత్రికి వెళ్తే అక్కడ వైద్య సిబ్బంది ఇచ్చిన ఇంజెక్షన్, మాత్రలు వికటించి శరీరంపై బొబ్బలు వచ్చాయి. మండలంలోని బూదేడుకు చెందిన శ్రీనివాసులు సోమవారం తెలిపిన వివరాలు మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి నడుం నొప్పి ఎక్కువ ఉండడంతో భార్యతో కలసి గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాడు. అక్కడ రాత్రి డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బంది రెండు ఇంజెక్షన్లు వేసి, మాత్రలు ఇచ్చారు. ఇంటికి వెళ్లి టీ తాగి మాత్రలు వేసుకొని నిద్ర పోయాడు. ఉదయం లేవగానే శరీరం, కాళ్లు, చేతులు ముఖంపై బొబ్బలు రావడం, నల్లని మచ్చలు వచ్చి, శరీరమంతా దురదతో తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి అక్కడ ఉన్న వైద్య సిబ్బందికి జరిగిన విషయం చెప్పగా మాత్రలు వల్ల రీయాక్షన్ వచ్చిందని, మాత్రలు వెనక్కి తీసుకొని వేరే మాత్రలు ఇచ్చారు. ఆ మాత్రలు మింగినా దురద, బొబ్బలు తగ్గలేదంటూ బాధితుడు వాపోయాడు. దీంతో గార్లదిన్నెలోని ఓ ఆర్ఎంపీని సంప్రదించి రెండు రోజులుగా వైద్యం చేయించుకుంటున్నానన్నాడు. సూది, మాత్రలు వికటించినా బాధితుడిని పట్టించుకోకపోవడంతతో వైద్య సిబ్బందిపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించండి

పామిడి: గ్రామీణులకు విశిష్ట సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కు విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన అనుమతులను(ఎఫ్‌సీఆర్‌ఏ) పునరుద్ధరించాలని ఐక్యమాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్ డిమాండ్ చేశారు. పామిడిలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో వంద గంటల రిలే నిరాహార దీక్షలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఈసందర్భంగా ఆయనతో పాటు రాజ్‌కుమార్, కేశవ, ఈశ్వరమ్మ, నక్షత్రమ్మ, కమలమ్మ, అంజినమ్మ, సంజమ్మ, లక్ష్మీదేవి, దుర్గమ్మ, లాలెప్ప, కుళ్ళాయప్ప, సుధాకర్, మల్లికార్జున, రామచంద్ర, ఎర్రిస్వామి, రమేష్, చిన్న లాలెప్ప, మారెన్న, ఆదినారాయణ, రాము, పెద్ద లింగమయ్య, రాజేష్, ఎంసీ నాగరాజు దీక్షకు కూర్చొన్నారు. వారి దీక్షకు సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించండి

పామిడిలో సేవ్ ఆర్డీటీపై ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తేవాలని సీపీఎం నాయకుడు పీ అనిమిరెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కే రహీమ్ కోరారు. ఈమేరకు సోమవారం వారు గ్రీవెన్స్‌లో తహసీల్దార్ సీ షర్మిలకు వినతి పత్రం సమర్పించారు కార్యక్రమంలో వామపక్షపార్టీల అనుబంధ సంఘాల నాయకులు ఎస్.నాగరాజు, మల్లేసు, చంద్రమోహన్‌రెడ్డి, చౌడప్ప, ఇమామ్, షెక్షావలి, ఐక్యమాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేసు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

సాక్షి ఎఫెక్ట్..



పీ కొత్తపల్లిలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయిస్తున్న ఈఓఆర్డీ అశ్వత్థనాయుడు

పామిడి: మండలంలోని పీ కొత్తపల్లిలో అధికారులు ట్యాంకర్ల ఏర్పాటు చేసి నీరందించారు. కొత్తపల్లిలో తాగునీటికి కటకట అన్న శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పామిడి పంచాయతీ ఈఓ కమ్ ఈఓఆర్డీ అశ్వర్థనాయుడు స్పందించారు. ఆయన ఆ గ్రామానికి వెళ్లి తాగునీటి కష్టాలపై ప్రజలతో సమీక్షించారు. ట్యాంకర్లను ఏర్పాటు చేసి గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేయించారు. అలాగే పామిడిలోని 17వవార్డులో నిరుపయోగంగా మారిన స్పాట్ డెలివరి ట్యాంకును పరిశీలించారు. ఆ వార్డులో మోటార్‌ను మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించారు. అలాగే పెన్నానది నుంచి పీ కొత్తపల్లి గ్రామ ఓహెచ్ఆర్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసే మోటారు చెడిపోయిందని, దీన్ని సైతం మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. అదేవిధంగా పామిడి పంచాయతీ మజరా గ్రామం పీ కొండాపురంలోని ఎస్సీ కాలనీలో మోటారుకు మరమ్మతులు చేపట్టి నీటి ఎద్దడిని నివారించారు. మండలంలో నీటిఎద్దడిపై సమాచారమిస్తే వెంటనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో ఉన్న రహమత్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే పార్టీ విస్తృతస్థాయి సమావేశం జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రమావత్ రామకృష్ణ నాయక్ సోమవారం కోరారు. 13 నెలల కూటమి పాలన వైఫల్యాలను ఎండగట్టే 'రీ కాలింగ్ చంద్ర బాబూస్ మేనిఫెస్టో-బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి, గుంతకల్లు సమన్వయకర్త వై వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతిరెడ్డి తదితర పార్టీ శ్రేణులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైఎస్ అభిమానులు, మేధావులు, ప్రజలు తరలిరావాలన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది



తాడిపత్రిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి



నార్పలలో నిరసన తెలుపుతున్న పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

తాడిపత్రిటౌన్: దోపిడీలు, దొంగతనాలు, అక్రమ అరెస్టులతో రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి ఆరోపించారు. తాడిపత్రి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద సోమవారం ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నల్లబాడ్జీలు దరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలన పై రాష్ట్ర ప్రజలు అసహించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ 175 కు 175 సీట్లు రావడం ఖాయం అన్నారు. 2014 టీడీపీ ప్రభుత్వంలోనే లిక్కర్ స్కాం జరిగిందన్నారు. హామీలను నేర వేర్చలేక ప్రజల దృష్టిని మరల్చేందుకే చంద్రబాబు , లోకేష్, పవన్‌కళ్యాణ్ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. రఫీ, నాగభూషణం, జఫ్రూ, రియాజ్, షాషా, జిలాన్, రామాంజి, గిరి, బాబా, కొండయ్య, రాము, సాయిరెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అక్రమ కేసులకు అదరం.. బెదరం

నార్పల: కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు అదరం, బెదరమని అనంతపురం పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన నార్పలలో పార్టీ శ్రేణులతో కలసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేకపోయిన సిట్ విచారణ పేరుతో అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన మరిచి ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. మీరు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తొందర్లోనే కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్, ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచు రామాంజనేయులు, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, జిల్లా యువజన విభాగపు నాయకులు సోహైల్ తన్వీర్, గవ్వల సాయి, హరినాథ్‌రెడ్డి, దాడితోట బాషా, అమీర్, నారాయణరెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అరెస్ట్ దుర్మార్గం

గార్లదిన్నె: ఎంపీ మిథున్ రెడ్డిపై అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా కేసులు బనాయిస్తోందని, భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

అరాచక పాలన

పెద్దవడుగూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైన ,నాయకుల పైన అరాచకాలు అధికం అయ్యాయని వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు గూడూరు సూర్యనారాయణరెడ్డి మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దవడుగూరు లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికార ం చేపట్టినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. కార్యక్రమంలో చిన్నవడుగూరు సర్పంచ్ వెంకటరమణ రెడ్డి, చిట్టూరు నాగభూషణ, దిమ్మగుడి మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, కాశేపల్లి రామాంజులరెడ్డి, శ్రీరాములు, , సోషల్‌మీడియా కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, చిన్న వడుగూరు బాబు, కొండూరు దేవమోహన్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అమానుషం

పామిడి: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమంగా లిక్కర్ కేసు బనాయించి అరెస్ట్ చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు మండిపడ్డారు. సోమవారం ఆయన పామిడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. కూటమి కక్ష సాధింపులో భాగంగానే ఆయనను అక్రమ కేసులో ఇరికించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రమావత్ రామకృష్ణ నాయక్, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, రజాక్‌వలి, సర్పంచ్ మూలి నాగేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో సీఈసీ, ఎంపీసీ గ్రూపులు ఇంగ్లిష్, తెలుగు మీడియం అందుబాటులో ఉందన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

గుత్తి: తాడిపత్రిలో గత ఆదివారం ప్రణబ్ అబాకస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో గుత్తి ఆర్ఎస్‌కు చెందిన మానీష్ అబాకస్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. మానీష్ అబాకస్ సెంటర్ నుంచి 23 మంది పాల్గొనగా అభిరామ్, దివ్య భారతి, దృశ్య దేదీప్య చాంపియన్లకే చాంపియన్లుగా నిలిచారు. అలాగే మారుతి మోక్షిత్, తనుశ్రీ, ఆయూష్ ప్రధాన్, కుసుమ, దక్షిత్ చాంపియన్లుగా నిలిచారు. మరో ఎనిమిది మంది టాపర్స్‌గా నిలిచి సత్తా చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నిర్వాహకురాలు పుణ్యవతి తదితరులు అభినందించారు.

'ఫిట్ ఇండియా–గ్రీన్ ఇండియా'పై ర్యాలీ

గుత్తి: పట్టణంలో సోమవారం మాసినేని స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా–గ్రీన్ ఇండియా కార్యక్రమంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. సేవ్ ట్రీ, సేవ్ లైఫ్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు దుకాణాలకు వెళ్లి సుమారు 2000 మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ మాసినేని అమరేంద్ర, మాసినేని స్వాతి, ఇంచార్జులు పవన్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కళ్యాణం శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను కలిసిన నీలూరు నాగార్జున తదితరులు

పామిడి: గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ పామిడి మండల యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నీలూరు నాగార్జున మర్యాద పూర్వకంగా కలిశారు. తన ఎంపికకు సహకరించినందుకు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పాటుపడడమే కాకుండా వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతిరెడ్డి, జిల్లా కబడీ అసోసియేషన్ అధ్యక్షుడు సీబీ మంజునాథ్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి బెల్లాల రమణారెడ్డి, మండల వైస్ కన్వీనర్ నీలూరు హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పోస్టర్ల విడుదల

పుట్లూరు: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే పదో తరగతి, ఇంటర్‌మీడియట్ దూరవిద్య అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంఈఓ శ్రీదేవి తదితరులు విడుదల చేశారు. 14 సంవత్సరాలు నిండి చదవడానికి, రాయడానికి వచ్చిన వారు, బడి మధ్యలో మానేసిన వారు పదవ తరగతి, 10వ తరగతి పాసై 15 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్ చదువుకునే అవకాశం ఉందన్నారు. ఏపీ ఆన్‌లైన్, గ్రామ సచివాలయాల ద్వారా ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

టెంకాయలు, తలనీలాల హక్కుకు నేడు వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, తలనీలాల సేకరించు హక్కు, కొబ్బరి చిప్పల సేకరణ, హోటల్ నిర్వహణ హక్కు కోసం మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనునట్లు ఈఓ సుబ్రమణ్యం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాఘమాసం మినహా విడిదినాల్లో మాత్రమే పైన తెలిపిన వాటికి హక్కు ఉంటుందన్నారు. టెంకాయలు, తలనీలాల వేలంలో పాల్గొను వారు రూ.50,000, కొబ్బరిచిప్పలు, హోటల్ నిర్వహణ వేలంలో పాల్గొను వారు.రూ.10,000 డిపాజిట్ చెల్లించాలన్నారు.

బూదేడు ఫీల్డ్ అసిస్టెంట్ అదృశ్యం

గార్లదిన్నె: మండలంలోని బూదేడుకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఓబిలేసు అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. ఈనెల 14న ఓబిలేసు ఇంటి నుంచి బయటకు వెళ్లి.. ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరు సమీపంలో ఆదివారం రాత్రి టిప్పర్ డ్రైవర్ నారాయణరెడ్డిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. కొండూరు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి హెచ్ఎల్సీ కాలువ పనులు చేయడం కోసం జేసీబీని టిప్పర్‌లో వేసుకుని పామిడి మండలం ఎదురూరు వైపు బయలుదేరాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనాల్లో ఎదురూరు గ్రామానికి చెందిన ఇమ్రాన్, నరసింహులు, అలీబాబా, మరో యువకుడు కలసి గ్రామానికి వెళ్తున్నారు. తమ వాహనాలు ముందుకు వెళ్లడానికి దారి ఇవ్వలేదని టిప్పర్ డ్రైవర్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పీహెచ్‌సీ అటెండర్ మృతి

గార్లదిన్నె: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న గీతమ్మ (42) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. వివరాల మేరకు.. గీతమ్మ భర్త విజయరాజు అనంతపురం ప్రభుత్వాస్పత్రిలోని మలేరియా విభాగంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ 2012లో చనిపోయారు. జిల్లా వైద్యాధికారులు ఆమెకు వైద్యశాఖలో అటెండర్ ఉద్యోగం ఇచ్చారు. ప్రస్తుతం ఆమె గార్లదిన్నె పీహెచ్‌సీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురంలోని ఇంట్లో ఆమె మృతి చెందింది. ఆమెకు ఒక కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న గార్లదిన్నె వైద్య సిబ్బంది అనంతపురానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇరు వర్గాల ఘర్షణ

గుత్తి: రస్తా విషయంలో గుత్తి ఆర్ఎస్‌లో సోమవారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కొంత కాలంగా రస్తా విషయంగా స్థానికులు వెంకట లక్ష్మి, లాల్‌రెడ్డి మధ్య వివాదం నడుస్తోంది. ఇరు వర్గాలు కోర్టును కూడా ఆశ్రయించారు.ఈ క్రమంలో సోమవారం ఘర్షణ చోటు చేసుకుని, ఇరు వర్గాలకు చెందిన వెంకటలక్ష్మి, దుర్గా భవానీ, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా శారద



తాడిపత్రి రూరల్: స్వకుల సాలి సమాజం రాష్ట్ర సెక్రటరీగా తాడిపత్రికి చెందిన శారద ఎంపికైంది. గుత్తిలో సోమవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శారదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమె భర్త తాడిపత్రి అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్, అల్ ఇండియా ఈసీ మెంబర్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.